

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 03-03-2023 సంపుటి : 04 సంచిక : 165 పేజీలు : 4 వెల : రూ 3-00

# విశాఖ వేదికగా నేటినుంచి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్






**నేటి ఉదయం ప్రారంభించనున్న సిఎం జగన్**

**భారీగా ఏర్పాట్లు చేసిన ఎపి ప్రభుత్వం**

**2లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం**

**ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్**



విశాఖపట్టణం,మార్చి2 : పెట్టుబడులే లక్ష్యంగా విశాఖ వేదికగా నేటినుంచి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ జరుగనుంది. ఇందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నం వేదికగా నిర్వహించబోయే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ద్వారా రూ.2లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, తద్వారా యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం తరపున అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ శుక్రవారం ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ సదస్సుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చివరి దశకు వచ్చాయి. సదస్సు ప్రాంగణం అంతా సెక్యురిటీ లైజన్ లోకి వెళ్లిపోతుంది. ఇప్పటికే 14వేల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రేపు వచ్చే డెలిగేట్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒకరోజు ముందుగానే రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టడం జరిగిందని మంత్రి అన్నారు. సీఎం జగన్ సాయంత్రం విశాఖకు చేరుకుంటారు. ఆ తర్వాత సీఎం శుక్రవారం జరగబోయే సదస్సుకు సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. శుక్రవారం10.15 గంటలకు సీఎం జగన్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. వివిధ దేశాలకు చెందిన అంబాసిడర్స్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు రానున్నారు. రాబోయే ప్రముఖుల అందరి సమక్షంలో ఇనాగురల్ సెషన్ రేపు 2 గంటల ఉంటుంది. అదేవిధంగా రేపు కొన్ని ఎంవోయూలు చేయడానికి నిర్ణయించకున్నాం. ఇక్కడ ఏర్పాటు చేసిన 150 పై చిలుకు స్టాల్స్ కు సంబంధించిన ఎగ్జిబిషన్ ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తోపాటుగా, సీఎం జగన్ ప్రారంభిస్తారు. ఎంపిక చేసిన 14 కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు సంబంధించి సెక్టరల్ సెషన్స్ కూడా జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలతో సీఎం జగన్ వారితో బ్యాక్ టూ బ్యాక్ మీటింగ్ లో పాల్గొంటారని మంత్రి అమర్నాథ్ స్పష్టం చేశారు. సీఎం జగన్ అంటే క్రెడిబిలిటీ అని..వారి నాయకత్వం పెట్టుబడిదారులకు సహకరిస్తుంది అనే నమ్మకాన్ని రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలకి కల్పించామన్నారు. రేపు కూడా అదే నమ్మకాన్ని గ్లోబల్ పారిశ్రామిక వేత్తలకు కల్పించనున్నామని తెలిపారు. రాష్ట్ర ఎకానమీని అభివృద్ధి చేయడం, అంతేకాకుండా యువతకు ఉపాధి కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని వివరించారు.

# 25మంది ఎంపిలను ఇస్తే హోదా తెస్తానన్నాడు



**విభజన సమస్యలు పరిష్కరిస్తానని చెప్పాడు**

**హామీ ఇచ్చిన జగన్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరు**

**తెలంగాణ సిఎం కెసిఆర్‌తో కుమ్మక్కు రాజకీయాలు**

**ముస్లిం మైనార్టీలకు ఎన్నో పథకాలు అమలు చేశాం**

**యువగళం పాదయాత్రలో లోకేశ్ మైనార్టీలతో భేటీ**



తిరుపతి,మార్చి2: తెలంగాణ సిఎం కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కయ్యారని.. అందుకే ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం సిఎం జగన్ కానీ, మంత్రులు, వైసిపి నేతలు తెలంగాణలో, ఢిల్లీలో నోరు మెదపడం లేదని టీడీపీ యువనేత నారా లోకేష్ విమర్శించారు. మాకూ 25 మంది ఎంపీలను ఇవ్వండి, ప్రత్యేక హోదా మాత్రమే కాదు విభజన చట్టంలోని ప్రతి అంశం పైన పోరాడుతామన్న జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని అన్నారు. ఎందుకు ప్రత్యేకహోదా, విభజన హామీలపై పోరాడడం లేదన్నారు. టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. చంద్రగిరి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న లోకేశ్ దామలచెరువులో ముస్లింలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. జగన్ 25 మంది ఎంపీలను ఇవ్వండి ప్రత్యేక హోదా తెస్తానన్నాడు. దీక్ష చేశారు. ధర్నా చేశారు. ఈరోజు ఆ ధర్నాలు ఏమైంది. ఒక రోజైనా ప్రత్యేక హోదా కోసం మాట్లాడాడా? అని ప్రశ్నించారు. అయితే మాకూ 25 మంది ఎంపీలను ఇవ్వండి, ప్రత్యేక హోదా మాత్రమే కాదు విభజన చట్టంలోని ప్రతి అంశంపైన పోరాడుతామన్నారు. అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఉర్దూ టీచర్ పోస్టులు నుంచి హజ్ యాత్రకు సహాయం వరకు మైనారిటీల కోసం తాము ఎన్నో చేశామని గుర్తుచేశారు. మేము చేసినవి ప్రచారం చేసుకోలేదు అదే మేం చేసిన తప్పని అన్నారు. ముస్లిముల కోసం టీడీపీ ఏం చేసింది..ఈ నాలుగేళ్లలో వైసీపీ ఏం చేసిందనే విషయంపై ఉప ముఖ్యమంత్రితో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఎక్కడికి వస్తారో ఎప్పుడో చెప్తే తాను చర్చకు సిద్ధమని యువనేత సవాల్ విసిరారు.అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు తాము ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కర్ణాటకలో డీకేటీ పట్టాలపై ఉన్న చట్టాన్ని అధ్యయనం చేసి ఇక్కడ కూడా డీకేటీపై మంచి చట్టాన్ని తీసుకొస్తా మన్నారు. ఫోన్లో బటన్ నొక్కితే అన్ని వస్తువులు వస్తున్నాయని... అలాగే సంక్షేమ పథకాలు గాని ప్రభుత్వ స్పందన గాని ఫోన్ నొక్కితే జరిగేలా చేస్తామని చెప్పారు. బిడ్డ పుట్టినప్పుడు బర్త్ సర్టిఫికెట్ ఇచ్చిన వెంటనే క్యాస్ట్ సర్టిఫికెట్ కూడా ఆటోమేటిక్గా ఫోన్లో బటన్ నొక్కితే వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ నిధులతో కబరిస్తాన్‌ల కాంపౌండ్ వాల్‌లను నిర్మిస్తామన్నారు.

# సత్ఫలితాలు ఇస్తున్న ఫేస్ రికగ్నేషన్

**నకిలీ దందాలకు చెక్ పడిందన్న టిటిడి ఇవో**

తిరుమల,మార్చి2 తిరుమలలో అమలులోకి వచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధానం సత్ఫలితాలు ఇస్తోందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. దీంతో ఇక అక్రమాలకు చెక్ పడనుందన్నారు. నకిలీ వ్యవహారాలు సాగవని కూడా అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నూతన విధానం ద్వారా దళారీల బెడద తప్పిందన్నారు. గదులు రొటేషన్ చేసే విధానం కూడా ఆగిపోయిందని చెప్పారు. ఈ విధానంతో నిజమైన భక్తులే గదులు పొందుతున్నారని అన్నారు. ఈ విధానం ప్రవేశ పెట్టడంతో భక్తులకు త్వరగతిన గదులు లభిస్తున్నాయని తెలిపారు. సర్వదర్శనం భక్తులకు ఈ విధానం ద్వారానే ఉచిత లడ్డు టోకెన్లను జారీ చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఈ విధానాన్ని ఇంకా పటిష్టం చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ యాప్ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. శ్రీవారి సర్వదర్శనం, లడ్డూ ప్రసాదం, గదుల కేటాయింపు, రిఫండ్ చెల్లింపునకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని టీటీడీ ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఈ యాప్ ద్వారా దర్శనం, లడ్డూల పంపిణీలో అవకతవకలు జరిగే అవకాశం ఉండదని టీటీడీ భావిస్తోంది.

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మకు జగన్ శాంతి లేకుండా చేస్తున్నారు

**కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి సంచలన వ్యాఖ్యలు**

అమరావతి మార్చ్ 2 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆత్మకు జగన్ శాంతి లేకుండా చేస్తున్నారని రేణుకా చౌదరి విమర్శించారు. గతంలోనూ జగన్ పిచ్చి వేషాలు వేసేవారని, తండ్రిగా వైఎస్సార్ బయటకు రాకుండా కాపాడారని ంఃఔ ప్రత్యేక ఇంటర్వ్యూలో రేణుకా చౌదరి చెప్పారు. బంగారం లాంటి రాష్ట్రం నాశనం అయిపోతోందని, సుప్రీంకోర్టు తీర్పులను కూడా లెక్కచేయడం లేదని రేణుకా చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంపై సుప్రీంకోర్టు ఎందుకు సుమోటోగా యాక్షన్ తీసుకోవడం లేదు? అని ఆమె అన్నారు. అధిష్టానం ఆదేశిస్తే విజయవాడ పార్లమెంట్ నుంచి పోటీచేస్తానని రేణుకా చౌదరి అన్నారు. పేర్ల మార్పుతో ఎన్టీఆర్ కీర్తి తగ్గుతుందని, వైఎస్సార్ కీర్తి పెరుగుతుందనుకోవడం పొరపాటు అని రేణుకా చౌదరి తెలిపారు.'రాష్ట్రానికి ఫస్ట్ ఓ యూనివర్సిటీని తీసుకురండి.. అప్పుడు మీ పేరో.. మీ తాత పేరో పెట్టుకోండి' అని జగన్‌కు రేణుకా చౌదరి సూచించారు. అమరావతి రైతులకు ఎంత అడ్డంపడితే అంతగా వారి ఉద్యమం బలపడుతుందని, ఈ ఉద్యమం ద్వారా రైతు గౌరవాన్ని పెంచారని.... రైతులకు కులం లేదని ఆమె అన్నారు. ఏ క్షణం అయినా రాజధాని రైతులు పిలిస్తే తాను వస్తానని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు చెప్పినా రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు ముఖ్యమంత్రిపై యాక్షన్ తీసుకోవాలని లేకపోతే ప్రజలే సహాయనిరాకరణ చేస్తారని హెచ్చరించారు. చంద్రబాబు ఏదో ఒక సైబరాబాద్‌ను తయారు చేశారని.. ఆయన వల్ల అంతో ఇంతో లాభం కలిగిందని రేణుకా చౌదరి చెప్పారు.



# విశాఖకు సీఎం జగన్..





తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖలో రేపు, ఎల్లుండి(శుక్ర, శనివారాల్లో) జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సీఎం జగన్ పాల్గొననున్నారు.దీనిలో భాగంగా ఈరోజు(గురువారం) సీఎం జగన్ తాడేపల్లి నుంచి విశాఖకు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో సీఎం జగన్‌కు మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుండి రాడిసన్ బ్లూ హోటల్‌కు సీఎం జగన్ చేరుకున్నారు. రాత్రికి నగరంలో బస చేస్తారు సీఎం జగన్.

3వ తేదీ షెడ్యూల్

ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సీఎం పాల్గొంటారు. రాత్రి 8.00-9.00 గంటల సమయంలో ఎంజీఎం పార్క్ హోటల్‌లో జీఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాత్రి బస చేయనున్నారు.

4వ తేదీ షెడ్యూల్

ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుని రెండో రోజు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 3.40 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# ముస్తాబైన విశాఖ

**గ్లోబల్ సమ్మిట్ కు అంతా సిద్ధం**

విశాఖపట్టణం, మార్చి 2, ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో వేదికలు సిద్ధం చేశారు. సుమారు 2 లక్షల 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వేదికలు రెడీ అయ్యాయి. ఏడుగురు కేంద్ర మంత్రులు, 40 దేశాల నుంచి రాయబారులు, పాతిక దేశాల ప్రతినిధులు, మన దేశానికి చెందిన 30 మంది పారిశ్రామిక దిగ్గజాలు విశాఖ రాబోతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై సెషన్స్ వారీగా ఎక్స్‌పర్ట్స్‌తో చర్చలు ఉంటాయి. మొత్తం పాతిక ప్రత్యేక విమానాల్లో అతిథులు రానుండగా.. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో 18 ఫ్లైట్స్‌కు మాత్రమే పార్కింగ్‌కు సరిపడా సౌకర్యాలున్నాయి. మిగతా వాటిని రాజమండ్రిలో పార్కింగ్ చేయాలని నిర్ణయించారు.ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం వంద కోట్లతో విశాఖ నగరాన్ని 100 కోట్లతో సుందరీకరించారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఏర్పాట్లపై టీవీ9తో ప్రత్యేకంగా మాట్లాడారు జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లిఖార్జున్. విశిష్ట అతిథులకు ఎంజెఎం బీచ్ పార్క్‌లో గాలా డిన్నర్‌కు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారాయన. ఆ డిన్నర్‌లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.పెట్టుబడుల సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అమర్నాథ్.. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి రాష్ట్రంలో పుష్కలంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 11 ఇండస్ట్రియల్ కారిడార్స్ అభివృద్ధి చెందుతూ ఉంటే అందులో మూడు ఏపీలో ఉన్నాయని గుర్తుచేశారు. పెట్రో కెమికల్ కారిడార్, మారిటైమ్ ఆధారిత పారిశ్రామికీకరణ, గ్రీన్ ఎనర్జీ రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు.

# ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌పై కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్: ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌పై తెలంగాణ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. విశాఖలో ఇన్వెస్టర్ సమ్మిట్ విజయవంతం కావాలని కేటీఆర్ ఆకాక్షించారు.తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ఉత్తమ రాష్ట్రాలుగా ఉండాలని కేటీఆర్ ట్వీటర్‌లో పేర్కొన్నారు.కాగా, ఏపీకి భారీగా పెట్టుబడులను రప్పించడం, ఉపాధి కల్పనే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో పాల్గొనేందుకు కార్పొరేట్ దిగ్గజాలు విశాఖ చేరుకుంటున్నాయి. విశాఖ సమ్మిట్‌లో పాల్గొనేందుకు బుధవారం ఒక్క రోజే నాలుగు వేలకుపైగా రిజిస్ట్రేషన్స్ నమోదు కాగా ఇప్పటివరకు మొత్తం 12,000కి పైగా నమోదు కావడం గమనార్హం. గత సర్కారు మాదిరిగా ఆర్భాటాలు కాకుండా వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది.

# సంపాదకీయం

శుక్రవారం 03-03-2023

## వాతావరణ మార్పులతో ఈ వేసవి సన్ డేలు...

ఈ వేసవి చాలా హాట్ గురూ అంటోంది భారత్ వాతావరణ శాఖ. ఈ వేడి కారణంగా భారత్‌లో చాలా ప్రమాదకరమైన పరిస్థితులను చూడాల్సి వస్తోందని హెచ్చరిస్తోంది. పంటలు దెబ్బతింటాయని, విద్యుత్ సంక్షోభం కూడా చూడాల్సి ఉంటుందని వార్నింగ్ ఇస్తోంది. మే 31తో ముగిసే మూడు నెలల్లో చాలా ప్రాంతాల్లో వేడి గాలులు భయభ్రాంతులకు కారణం కాగలవని అంచనా వేస్తున్నట్లు భారత వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త ఎస్.సి.భాన్ తెలిపారు. హాట్ వెదర్ కారణంగా ఇప్పటికే సమస్యలు మొదలయ్యాయి. విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. పంటలపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. గోధుమ పంటపై ప్రభావాన్ని పర్యవేక్షించడానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈసారి హాట్ వెదర్ గత రికార్డులను అధిగమించబోతుందోని అంచనా వేస్తున్నారు. గత సంవత్సరంలో మార్చిలో మాత్రమే అత్యంత ఉష్ణోగ్రతను నమోదు చేసింది. ఒక శతాబ్దంలోనే అత్యంత హాట్ మార్చిగా రికార్డుల్లోకి ఎక్కింది. మార్చిలో మొదలైన హీట్ వేవ్స్ ధాటికి కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పంటలు ఎండిపోవడం, విద్యుత్ కొరత ఏర్పడటంతో ముందస్తు చర్యలు చేపట్టింది. ఎగుమతులను అరికట్టింది. విద్యుత్ సంక్షోభం ఎదుర్కోకుండా జాగ్రత్తలు తీసుకుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా నెలవారీ సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 1901 నుంచి ఫిబ్రవరిలో అత్యధికంగా ఉన్నాయి. మార్చిలో ఉష్ణోగ్రతలు ద్వీపకల్ప ప్రాంతం మినహా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు దేశంలో వివిధ పంటలపై తీవ్ర ప్రభావం పడనుంది. ముఖ్యంగా గోధుమ ఉత్పత్తిని దెబ్బ తీయనుంది. రెండో ఏడాది కూడా పంటకు ముప్పు పొంచి ఉంది. ఫలితంగా ఆహార కొరత ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. గోధమ దిగుబడిలో చైనా తర్వాత భారతదేశం రెండో అతిపెద్ద ఉత్పత్తిదారు. తక్కువ దిగుబడి ఎగుమతి నియంత్రణకు దారి తీయవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. వాతావరణ మార్పులు ఎక్కువ ఎఫెక్ట్ పడుతున్న దేశాల్లో భారత్ ఒకటి. హీట్‌వేవ్స్, భారీ వరదలు, తీవ్రమైన కరవు వంటి వాతావరణ పరిస్థితులు ఇండియాపై చాలా దుష్ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం వేల మందిని బలి తీసుకుంటున్నాయి. వ్యవసాయ ఉత్పాదకతను తగ్గిస్తున్నాయి. దీని వల్ల ఆర్థిక కష్టనష్టాలు పెరిగిపోతున్నాయి. వీటి ఫలితంగా శిలాజ ఇంధనాల డిమాండ్ పెరుగుతోంది. జలవిద్యుత్ వనరులు పూర్తిగా అడుగంటే పరిస్థితి ఏర్పడుతోంది. దీని వల్ల దేశ ఇంధన సరఫరాలపై పెను భారం పడుతుంది. దిగుమతి చేసుకున్న బొగ్గుతో నడిచే పవర్ ప్లాంట్లు వేసవిలో మూడు నెలలపాటు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని, బ్లాక్‌అవుట్‌లను నివారించడానికి, దేశీయ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. ఎయిర్ కండిషనర్లు, నీటిపారుదల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి జనరేటర్లు ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. దేశంలో 2015 నుంచి చూస్తే హీట్ వేవ్స్ బారిన పడిన రాష్ట్రాల సంఖ్య 2020 నాటికి రెండింతలు పెరిగింది. దేశంలో వేసవిలో సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత కంటే అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే దాన్ని హీట్ వేవ్‌గా చెబుతారు.

## లాభాల్లో పడిన జెన్ కో...

విజయవాడ, మార్చి 2, లాభనష్టాలపై జెన్‌కో అంచనాలను సిద్ధం చేసింది. ఈ ఏడాది కన్నా వచ్చే ఏడాది రూ.కోటి అదనంగా లాభం వస్తుందని అంచనాకు అధికారులు వచ్చారు. ఆదాయం, వ్యయం లాభ నష్టాలతో కూడిన నివేదికను కూడా జెన్‌కో అధికారులు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ నివేదిక ఆధారంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21.28 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనాకు వచ్చారు. వచ్చే ఏడాది రూ.13,677.68 కోట్లు ఆదాయంగా సమకూరుతుందని చెబుతున్నారు. ఇందులో విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.13,624.89 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.52.79 కోట్లు సమకూరుతుందని అంచనా. వ్యయానికి సంబంధించి మొత్తం రూ.13,649.47 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో అంతర్రాష్ట్ర విద్యుత్ కింద రూ.67.86 కోట్లు, ఇంధన వ్యయం కింద రూ.8,247.70 కోట్లు, నిర్వహణకు రూ.1653.67 కోట్లు, తరుగు కింద రూ.663 కోట్లు, అప్పుల చెల్లింపులు, వడ్డీలకు రూ.3,027.24 కోట్లు అవసరమవుతుందని భావిస్తున్నారు. ఈ గణాంకాల నేపథ్యంలోనే మొత్తం ఏడాదికి రూ.21.28 కోట్లు లాభంగా మిగులుతుందని అంచనా వేస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. వచ్చే నెలాఖరుతో ముగుస్తున్న ఆర్థిక సంవత్సరానికి రూ.20.06 కోట్ల లాభంతో ముగియనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆదాయం రూ.12,948.59 కోట్లుగా, వ్యయం రూ.12,921.86 కోట్లుగా గుర్తించారు. ఈ ఏడాది 23,735 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా, వచ్చే ఏడాది 29,920 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని అంచనా వేశారు. ఇందులో థర్మల్ విద్యుత్ ద్వారానే 25,916 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెబుతున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 21,762 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా, నాలుగేళ్లలోనే అది 29,920 మిలియన్ కిలోవాట్లకు చేరుకుంటురడడం గమనార్హం. ఇందులో 27,566 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ అమ్మకానికి అరదుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో కిలోవాట్‌పై రూ.4.94 వరకు ఆదాయం వస్తురదని కూడా అంచనా వేశారు.

## జగన్ ధైర్యం ఏంటో..



విజయవాడ, మార్చి 2, దమ్ముంటే టీడీపీ, జనసేన రెండు పార్టీలు విడివిడిగా 175 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని సీఎం జగన్ తెనాలిలో సవాల్ చేశారు. టీడీపీ, జనసేన పొత్తులు పెట్టుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతున్న సమయంలో జగన్ ఇలాంటి సవాల్ చేయడంతో.. వెంటనే.. వైఎస్ఆర్‌సీపీ నేతలు, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం ఈ సవాల్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అయితే చాలా మందికి విపక్షాలు ఎలా పోటీ చేయాలనేది వారి రాజకీయ వ్యూహం ...సీఎం జగన్ ఎందుకు ఇలా సవాల్ చేశారు.. ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే నెగ్గలేమని భావించడం వల్లే ఇలాంటి కామెంట్లు చేస్తున్నారని విమర్శించడం ప్రారంభించారు. ఓ రకంగా ఇదే కోణంలో ఎక్కువగా ప్రచారం జరుగుతోంది. మొదటి సారి చంద్రబాబు, పవన్ విజయవాడలోని ఓ హోటల్‌లో కలిసినప్పుడు ఎంత మంది కలిసి వచ్చినా సరే వార్ వన్ సైడే అని.. వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రకటించారు. టీడీపీ, జనసేన అసలు విడిపోలేదని మొదటి నుంచి కలిసే ఉన్నాయన్నారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వైసీపీ నేతలు కూడా ఓ క్లారిటీకి వచ్చారు. దీంతో రెండు పార్టీలను కలిపే విమర్శించడం ప్రారంభించారు. దీంతో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయా లేదా అన్నదాన్ని వైఎస్ఆర్‌సీపీ పట్టించుకోవడం లేదని.. తమ ఓటు బ్యాంక్ తమకు ఉంటుందన్న ధైర్యంతో ఉందని అనుకుంటూ వచ్చారు. అయితే అనూహ్యంగా ఇటీవలి కాలంలో పవన్ కల్యాణ్ ఒంటరిగా పోటీ చేయాలనే సవాల్ చేస్తూ వస్తున్నారు. టీడీపీతో కలిస్తే చంద్రబాబు సీఎం అవుతారని పవన్ సీఎం అవుతారా అ? ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబును సీఎం చేయడానికే పవన్ టీడీపీతో కలుస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. టీడీపీ, జనసేన కలిస్తే సీఎం ఎవరు అనే చర్చ కూడా పెట్టారు. కానీ ఈ చర్చలో అటు టీడీపీ కానీ.. ఇటు జనసేన కానీ జోక్యం చేసుకోలేదు. ఎందుకంటే.. రెండు పార్టీలు ఇంకా అధికారికంగా ఎలాంటి పొత్తుల చర్చలు కూడా ప్రారంభించలేదు. జనసేన పార్టీ ఇప్పటికీ బీజేపీతో పొత్తులో ఉన్నామని చెబుతోంది. అయితే జరుగుతున్న పరిణామాలు మాత్రం.. ఆ పార్టీ టీడీపీ వైపు మొగ్గు చూపుతోందని ఎక్కువ మంది నమ్ముతున్నారు. వైసీపీ నేతలూ నమ్ముతున్నారు. అందుకే ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ చేస్తున్నారు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కూడా ఒంటరిగా పోటీ చేయాలని రెండు పార్టీలకు సవాల్ చేశారు. ఒంటరిగా పోటీ చేయాలా.. కలిసి పోటీ చేయాలా అన్ని ఆయా రాజకీయ పార్టీల ఇష్టం. పొత్తులనేవి రాజకీయ పార్టీల్లో సహజం. కేంద్రంలో మోదీని ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ కూటమిని ఏర్పాటు చేసుకుంది. కానీ బీజేపీ ఎప్పుడూ ఒంటరిగా రావాలని కాంగ్రెస్ పార్టీని సవాల్ చేయలేదు. కూటమిగా పోటీ చేయడం వల్ల.. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోవు. మనది మెజార్టీ ప్రజాస్వామ్యం. మొత్తం వంద ఓట్లు ఉంటే.. యాభై ఒక్క ఓట్లు తెచ్చుకున్న వారికే గెలుపు రాదు. ఐదుగురు పోటీలో ఉండి.. ముగ్గురిరికి ఇరవై, ఒకరికి 19, మరొకరికి21 వస్తే .. 21 వచ్చిన వారిదే విజయం. మిగతా 79శాతం మందివ్యతిరేకంగా ఉన్నారు కదా అనే లాజిక్ మన ప్రజాస్వామ్యంలో ఇన్ వ్యాలీడ్. అందుకే పొత్తులు పెట్టుకుంటాయి. ఓట్లు చీలిపోవడం ద్వారా గెలుస్తామని సీఎం అనుకోవడం వల్లనే ఇలా సవాల్ చేస్తున్నారన్న అభిప్రాయం అంతకంతకూ బలపడుతోంది. సీఎం జగన్ ఉద్దేశం ఏదైనప్పటికీ.. టీడీపీ, జనసేన పార్టీ కలిస్తే గెలుపు కష్టమని నివేదికలు రావడం ద్వారానే జగన్ ఇలా సవాళ్లు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. వైఎస్ఆర్‌సీపీపై వ్యతిరేక ప్రచారం జరుగుతోంది. ఈ డ్యామేజ్ కంట్రోల్ చేయాలంటే.. రెండు పార్టీలు కలిసి పోటీ చేయడంపై ఎక్కువ కామెంట్స్ చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయం రాజకీయ నిపుణుల్లో వినిపిస్తోంది.

## 11 ఏళ్ల పాటు చీకటి గదిలో భార్య

అనంతపురం, మార్చి 2, కరోనా భయంతో నెలల తరబడి తమను తాము బంధించుకున్న వారి గురించి విన్నాం. కానీ భార్యపై అనుమానంతో ఆమెను పదొకొండేళ్ల పాటు ఒకే చీకటి గదికి పరిమితం చేసిన వ్యక్తి గురించి తెలుసా ?. ఎక్కడో లేదు.. మన మధ్యనే ఉన్నాడు. విజయనగరంలో లాయర్‌గా పని చేస్తున్న గోదావరి మధుసూదన్ తన భార్యను పదకొండేళ్ల నుంచి బయట ప్రపంచానికి చూపించలేదు. బయటకు అంటే ఇంట్లోనే చీకటి గదిలో ఉంచేసేవాడు. ఇక మిగతా ఇంట్లోకి కూడా రానిచ్చేవాడు కాదు. అలా పదకొండేళ్ల పాటు ఆమె ఆ చీకటి గదిలో బందీగా ఉంది. చివరికి ఆమె తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి... కూతుర్ని కాపాడుకున్నారు. శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన సాయి సుప్రియ కు విజయనగరం పట్టణం కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న గోదావరి మధుసూదన్ తో 2008లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం కూడా ఉన్నారు. న్యాయవాది మధుసూదన్ తన తల్లి గోదావరి ఉమామహేశ్వరి తో పాటు తన తమ్ముడు మాటలు విని కట్టుకున్న భార్యను బయట ప్రపంచానికి దూరం చేస్తూ చీకటి గదిలో బంధించాడు. ఎప్పుడూ బయటకు తీసుకు వచ్చేవాడు కాదు. పిల్లల్ని కూడా వెళ్లనివ్వడు. తన తల్లితోనే పిల్లల ఆలనా పాలనా చూపించేవాడు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు పదకొండేళ్లు గడిచిపోయాయి. చాలా సార్లు మధుసూదన్ బంధువు.. సాయి సుప్రియ తల్లిదండ్రులు.. ఆరా తీసినా ఏదో ఒకటి చెప్పేవాడు. ఎవరైనా గట్టిగా అడిగితే .. తాను లాయర్ నని చెప్పి బెదిరించేవాడు. తమ కుమార్తె బతికి ఉందో లేదో కూడా తెలియని పరిస్థితుల్లో సాయి సుప్రియ తల్లిదండ్రులు చివరికి న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ కుమార్తె ఏమైందో తెలియక వారు 11 సంవత్సరాల పాటు నరకయాతన అనుభవించారు. సహనం కోల్పోయిన బాధితురాకి తల్లిదండ్రులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఒకటవ పట్టణ పోలీసులు ఫిబ్రవరి 28వ తేదీన గోదావరి మధుసూదన్ ఇంటికి వెళ్లారు." మా ఇంటిని తనిఖీ చేసే అధికారం మీకు లేదు, తనిఖీ చేసేందుకు కోర్టు ఆదేశాలు ఏమైనా ఉన్నాయా" అని పోలీసులను ఆయన ఎదురు ప్రశ్నించాడు. దీంతో పోలీసులు, బాధితురాలి తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ వారెంట్ తీసుకువచ్చారు. సెర్చ్ వారెంట్తో పోలీసులు.. న్యాయవాది మధుసూదన్ ఇంటిని తనిఖీ చేశారు. సాయి ప్రియ బక్క చిక్కిన శరీరంతో చీకటి గదిలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఓ మూలన కనిపించింది. దీంతో పోలీసులు ఆమెను బయటకు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని ఒకటవ పట్టణ సీఐ వెంకటరావు తెలిపారు. పైకి సాధారణంగా కనిపించే లాయర్ మధుసూదనరావు.. ఇంత మూర్ఖుడా అని చుట్టుపక్కల వారు చర్చించుకుంటున్నారు. భార్యతో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి కానీ ఇలా జైలు శిక్ష వేసినట్లుగా ఇంట్లో బంధించి... సరిగ్గా తిండి పెట్టకుండా చిక్కిశల్యం అయ్యేలా చేయడం అంటే.. వారు అసలు మనుషులు కాదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## సేవలే లక్ష్యంగా పనిచేస్తున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు

కాకినాడ మార్చి 2 సేవ చేయడమే లక్ష్యంగా కాకినాడలోని 1978వ సంవత్సరంనకు చెందిన కాకినాడ రెడ్ కాన్వెంట్ విద్యార్థులు పనిచేస్తున్నారు. రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున గడిచిన ఆరేళ్ల కాలంలో సుమారు 83 లక్షల రూపాయలతో వివిధ రూపాల్లో వారు సేవలను నిర్వహించారు. గురువారం కాకినాడ లైన్స్ క్లబ్ హాలులో మూడు రూపాల్లో సేవలను ట్రస్ట్ సభ్యులు అర్హులకు అందించారు. 40 మందికి కళ్ళజోళ్ళు, దుస్తులతో పాటు శ్రీహరి అనే వ్యక్తికి 54 వేల రూపాయలు విలువచేసే వినికిడి యంత్రాలు, బీసీఇ చదువుతున్న విద్యార్థిని ప్రియాంకకు 20వేల రూపాయల స్కాలర్షిప్లను ట్రస్ట్ సభ్యులు అందించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బచ్చు కమల్ బాబు మాట్లాడుతూ ట్రస్ట్ ప్రారంభించి గడచిన ఆరేళ్ల కాలం నుండి ఇప్పటివరకు సుమారు 85 లక్షల రూపాయల విలువ చేసే సేవలను వివిధ రూపాలలో అందించామన్నారు. ఈ సేవలలో భాగంగా విద్యా, వైద్య వంటి సేవా రంగాలకే ట్రస్టు సభ్యులు తమ వంతు ఆర్థిక సహాయం అందించి దాంతో ఆ సహాయ కార్యక్రమాలు చేయడం పట్ల ట్రస్ట్ సభ్యులకు కమల్ అభినందనలు తెలిపారు. ట్రస్ట్ సభ్యుల ఆదర అభిమానాభిమానాలు, ఆర్థిక సహాయంతో మరింత ముందుకు సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని కమల్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎస్ పాపారావు, డాక్టర్ శేషగిరిరావు, బి శారద, ఎన్ కళ్యాణి, పి శ్రీనివాస్, బోడా ఆనంద్, ఆర్ రమణ మూర్తి, వి మధుసూదన్, లలిత్ కుమార్ జైన్, టి పద్మనాభం, వి సురేష్, వివి రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక వారాహి నుంచే జనసేనాని అడుగులు



విజయవాడ, మార్చి 2,జనసేన పార్టీ పదో ఆవిర్భావ సభను మచిలీపట్నంలో నిర్వహించాలని నిర్ణయించారు. జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని ప్రకటించారు. 34ఎకరాల్లో ప్రత్యేకంగా సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని నాదెండ్ల మనోహర్ తెలిపారు. భద్రత పరంగా తగిన విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. పార్టీ ఆవిర్భావ వేదికకు పొట్టి శ్రీరాములు వేదికగా నామకరణం చేశామని తెలిపారు. త్వరలోనే ఈ సభకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా, ప్రజల పక్షాన నిలిచేలా జనసేన కార్యక్రమాలు నిర్వహించిందని మనోహర్ వ్యాఖ్యానించారు. పవన్‌ను వ్యక్తిగతంగా అవహేళన చేసినా ప్రజల కోసం నిలబడ్డారని ఆయన గుర్తుచేశారు. జనసేన నాయకులు, వీర మహిళలు తమ అధినేతకు అండగా నిలిచారని.. ఏ పిలుపు ఇచ్చినా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మార్పు కోసం, వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజల్ని కంకణబద్ధుల్ని చేసే వేదిక ఈ ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. సభా వేదికపై రైతుల కోసం ఓ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారి పేరిట సభా వేదికను ఏర్పాటు చేస్తామని, జాతి గర్వించే మహానుభావుడు పింగళి వెంకయ్య గారు, స్వతంత్ర సమర సాయుధ పోరాట యోధుడు శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ల త్యాగాలను స్మరించుకునే విధంగా సభ ప్రాంగణం ఉంటుందని తెలిపారు. మార్చి 14వ తేదీన శ్రీ పవన్ కళ్యాణ్ గారు మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి వారాహిలో బయలుదేరి సభా ప్రాంగణానికి చేరుకుంటారని ఈ సందర్భంగా నాదెండ్ల ప్రకటించారు. రాబోయే పది రోజుల్లో సభ కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వైసీపీకి వ్యతిరేకంగా పాల్గొనాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని అన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపే విధంగా జనసేన ప్రణాళిక ఉంటుందన్నారు. ప్రజల కోసం, రాష్ట్ర శ్రేయస్సు కోసం పాటుపడుతున్న పవన్ ను ఆదరించండి అంటూ పిలుపునిచ్చారు. వైసిపి విముక్త ప్రభుత్వాన్ని తీసుకు రావాలన్నారు.

## జనసేనాని మళ్లీ సైలెంట్

విజయవాడ, మార్చి 2,జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో స్పందిస్తారు. అందులోనూ వైసీపీ ప్రభుత్వంలో జరిగే ఈ ఘటనపైనా ఆయన తక్షణమే స్పందిస్తారు. కానీ గన్నవరం ఘటనపై పవన్ కల్యాణ్ స్పందించకపోవడం హాట్ టాపిక్ గా మారింది. ఒకే ఒక ఘటన గన్నవరంలో జరిగిన సంఘటనపై పవన్ పెదవి విప్పనీయకుండా చేసిందా? అంటే అవుననే అంటున్నారు. పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో స్పందిస్తారు. ఆయన ఎంత సినిమా షూటింగ్ లలో బిజీగా ఉన్నా సరే ఏపీ రాజకీయాల్లో జరిగే ఘటనపై ఆయన ట్విట్టర్ లో స్పందిస్తుంటారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటారు. ఇటీవల అనపర్తిలో చంద్రబాబును అడ్డుకోవడం, కిలోమీటర్ల కొద్దీ పెద్దాయనను నడిపించడంపైన కూడా పవన్ కల్యాణ్ స్పందించారు. ఇది అమానుషమని అన్నారు. కానీ గన్నవరం లో టీడీపీ కార్యాలయంపై దాడులు, పట్టాభి అరెస్ట్ వంటి అంశాలపై మాత్రం పవన్ కల్యాణ్ పెదవి విప్పలేదు. దీంతో రాజకీయ పార్టీలో ఇది చర్చనీయాంశంగా మారింది. ఇందుకు రెండు కారణాలు చూపెడుతున్నారు. ఒకటి తన సామాజికవర్గమైన కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరడం. జనసేన పార్టీ ఉన్నా అందులో కన్నా చేరకుండా టీడీపీలో చేరారంటే జనసేనపై నమ్మకం లేకనే అన్న సంకేతాలు ఇటు సామాజికవర్గంలోనూ అటు పార్టీ అభిమానుల్లోనూ, పవన్ ఫ్యాన్స్ లోనూ నెలకొంది. రెండోది మరొకటి. కీలకమైనదే. పవన్ కల్యాణ్ కు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వెయ్యి కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు వచ్చిన కథనం కూడా పవన్ ను హర్ట్ చేసిందంటున్నారు. తనపై చంద్రబాబు అనుకూల మీడియా ఇప్పటి నుంచే దాడులు ప్రారంభించిందన్న అనుమానం పవన్ కల్యాణ్ లో కలిగిందంటున్నారు. ముఖ్యమంత్రి పదవి అడక్కుండా ముందర కాళ్లకు బంధం వేసే ప్రయత్నం జరుగుతందని ఆయన సందేహిస్తున్నారు. జనసేన క్యాడర్ లోనూ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీపై అసహనం, అసంతృప్తి పెరిగిపోయాయి. సోషల్ మీడియాలో పవన్ ను టీడీపీతో పొత్తు వద్దంటూ పోస్టులు పెడుతున్నారు. నాగబాబు కూడా కొంత సీరియస్ గానే రెస్పాండ్ అయ్యారు. కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నారని పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పవన్ కూడా వైసీపీ నేతలు ప్యాకేజీ అంటే పెద్దగా పట్టించుకోలేదు. దానిని రాజకీయ విమర్శగానే కొట్టిపారేశారు. ఒకసారి సీరియస్ అయి చెప్పుతో కొడతానంటూ తనను ప్యాకేజీ అన్న వారిపై ఫైర్ అయ్యారు పవన్ కల్యాణ్. కానీ పొత్తులు కుదరక ముందే చంద్రబాబు అనుకూల మీడియాలో వెయ్యి కోట్ల ప్యాకేజీ అని రావడం, అదీ ఎడిటోరియల్ కావడంతో పవన్ లో కూడా అనుమానాలు బయలుదేరాయి. భవిష్యత్ లో తాను టీడీపీతో పొత్తు కుదుర్చుకుని అధికారంలోకి తెచ్చినా ఈ మీడియా ద్వారా తనను వెంటాడతారని, తాను మరోసారి ఫూల్ కావడం ఇష్టపడక పోవచ్చని పవన్ కల్యాణ్ సన్నిహితుల వద్ద అన్నట్లు సమాచారం. మొత్తం మీద గన్నవరం ఘటనపై పవన్ స్పందించకపోవడానికి ఈ రెండు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాల్సి ఉంది

# పవర్ ఫ్రమ్ సోలార్...

నెల్లూరు, మార్చి 2, అంతరిక్షంలోకి మానవుడు అడుగుపెట్టడమంటేనే ఒకప్పుడు అత్యంత అద్భుతంగా భావించేవారు. కానీ విజ్ఞాన ప్రపంచం విశ్వమంతా వ్యాపించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అసాధ్యమనుకున్నవాటిని సుసాధ్యం చేస్తూ ఎప్పటికప్పుడు ఆశ్చర్యం కలిగిస్తూనే ఉన్నాయి. అలాంటి ఓ ఆవిష్కరణే అంతరిక్ష సౌరవిద్యుత్ (స్పేస్ సోలార్ పవర్ ? ఎస్ఎస్‌పీ). నమ్మశక్యంగా లేకపోయినా ఇది నిజం. భూమి మీద వివిధ పద్ధతుల ద్వారా, అనేక వనరుల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం గురించే ఇప్పటివరకు మనకు తెలుసు. కానీ.. తాజా ఆవిష్కరణ వాటికి విభిన్న విధానం. అంతరిక్షంలో పగలు, రాత్రి, రుతువులు, మేఘాల కవచం వంటి కాలచక్రాలతో సంబంధం లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విద్యుత్‌ను భూమి మీదకు తీసుకొచ్చే పరిశోధనలు 2011లో మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ పరిశోధనల్లో మరో అడుగు ముందుకుపడింది. సౌరవిద్యుత్‌ను 1800 సంవత్సరం చివరి నుంచి వాడడం మొదలుపెట్టారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రపంచంలోని విద్యుత్‌లో నాలుగు శాతం (అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి శక్తినివ్వడంతోపాటు) మాత్రమే సౌరవిద్యుత్ ఉత్పత్తి అవుతోంది. బొగ్గు, నీటి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నీటివనరులు ఇప్పటికే చాలావరకు తగ్గిపోగా.. బొగ్గు వల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాలు అధికమవుతున్నాయి. స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్యమం ప్రపంచ దేశాల్లో మొదలైంది. దీంతో అపారంగా ఉన్న సౌరశక్తిని వాడుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. దీన్లో భాగమే ఈ ప్రయోగం. భవిష్యత్‌లో దీనిద్వారా భూమి మీదకు వైర్‌లెస్ విధానంలో సౌరవిద్యుత్ ప్రసారం చేయగలమని శాస్త్రవేత్తలు గట్టిగా చెబుతున్నారు. సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమనుకున్న అనేక విషయాలను నేడు శాస్త్రవేత్తలు నిజం చేస్తున్నారు. ఆ కోవలో మొదలైనదే కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్టెక్) స్పేస్ సోలార్ పవర్ ప్రాజెక్ట్ (ఎస్ఎస్‌పీపీ). ఇదొక అంతరిక్ష పరిశోధన. ఈ పరిశోధన కోసం గత నెలలో కాలిఫోర్నియా నుంచి స్పేస్ సోలార్ పవర్ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్ఎస్‌పీడీ)ను అంతరిక్షంలోకి పంపారు. ట్రాన్స్‌పోర్టర్?6 మిషన్‌లో స్పేస్ఎక్స్ రాకెట్ ద్వారా మోమెంటస్ విగోరైడ్ అంతరిక్షనౌక 50 కిలోల బరువున్న ఎస్ఎస్‌పీడీని అంతరిక్షానికి తీసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా సూర్యరశ్మిని సేకరించి, దాన్ని విద్యుత్తుగా మార్చే మాడ్యులర్ స్పేస్‌క్రాఫ్ట్ సముదాయాన్ని అంతరిక్షంలోకి పంపించారు. ఇది విద్యుత్తును చాలా దూరం వరకు వైర్‌లెస్ రూపంలో ప్రసారం చేస్తుంది. కొన్ని పరిణామాల అనంతరం చివరికి పవర్ స్టేషన్‌గా ఏర్పడుతుంది. 32 రకాల ఫోటోవోల్టాయిక్‌లు అంతరిక్ష వాతావరణంలోని సౌరకణాలను విద్యుత్‌గా మార్చేందుకు ఉన్న అవకాశాలను అంచనా వేస్తాయిమైక్రోవేవ్ పవర్ ట్రాన్స్‌మిటర్ ద్వారా వైర్‌లెస్ విధానంలో విద్యుత్‌ను ట్రాన్స్‌ఫర్ చేసే సౌకర్యం ఉంటుంది. ఈ సెటప్ అంతా అంతరిక్షంలో అమర్చగానే భూమిపై ఉన్న కాల్టెక్ బృందం తమ ప్రయోగాలను ప్రారంభించింది. కొన్ని కెమెరాలు ప్రయోగం పురోగతిని పర్యవేక్షిస్తూ, భూమికి సమాచారం పంపిస్తున్నాయి. కొద్దినెలల్లోనే ఎస్ఎస్‌పీడీ పనితీరుపై పూర్తి అంచనా వేయగలమని ఎస్ఎస్‌పీపీ బృందం భావిస్తోంది.

# కష్టాల్లో షుగర్ ఫ్యాక్టరీలు

ఏలూరు, మార్చి 2, చెరకు రైతులను ఆదుకోవాల్సిన చక్కెర కర్మాగారాల పరిస్థితి దయనీయంగా ఉండడం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా సక్రమంగా లేకపోవడం వంటి కారణాలు ఈ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. మూడొంతులకుపైగా చక్కెర కర్మాగారాలు రాష్ట్రంలో మూతబడి ఉండడంతో రైతులు కూడా చెరకు సాగువైపు పెద్దగా దృష్టి సారించడం లేదు. రాష్ట్రంలో ప్రైవేటు, సహకార రంగాల్లో మొత్తం 29 కర్మాగారాలు ఉండగా, ఇందులో కేవలం ఐదు మాత్రమే మనుగడలో ఉండడం గమనార్హం. గతంలో చెరకుపైనే ఎక్కువగా ఆధారపడే స్థాయిలో రైతులు ఉండేవారు. ఐదేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో చెరకు సాగు బాగానే ఉండేది. అప్పట్లో 18 కర్మాగారాలు పనిచేయడంతో చక్కెర ఉత్పత్తి కూడా మెరుగ్గానే ఉండేది. 82 వేల హెక్టార్లలో చెరకు ఉత్పత్తి కూడా జరిగేది. 2017-18 సీజన్‌లో ఏకంగా 48 లక్షల మెట్రిక్ టన్నుల వరకు క్రషింగ్ జరిగింది. ఇప్పుడు పూర్తిగా పరిస్థితులు తారుమారయ్యాయి. కేవలం ఐదు కర్మాగారాలే పనిచేస్తుండడంతో చాలామంది రైతులు చెరకు సాగు మానేసి, ఇతర పంటలవైపు వెళ్లిపోతున్నారు. అందుకే గతేడాది 22.85 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరనే క్రషింగ్ చేయగలిగారు. అందులో నాలుగు ప్రైవేటు రంగానికి చెందిన కర్మాగారాలే క్రషింగ్ చేశాయి. చోడవరం, తాండవ, ఏటికొప్పాక కర్మాగారాలకు రూ.26 కోట్లకుపైగా బకాయిలు ఉండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. 2021 సీజన్ వరకు చెల్లింపులు జరిగినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ గతేడాదికి ఇంకా చెల్లింపులు జరుగలేదు. దీంతో రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కనిపిస్తోంది. కర్మాగారాల పరిస్థితి బాగోలేకపోవడంతో పనిచేయని వాటిల్లో ఆరు కర్మాగారాల్లో వీఆర్ఎస్ అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిఫార్సులు చేసింది. ఇవన్నీ సహకార రంగంలో ఉన్నవే కావడం విశేషం. దీనిపై గతంలోనే ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం అనేక దఫాలు భేటీలు నిర్వహించి, చివరకు వీఆర్ఎస్ సిఫార్సుల నిర్ణయం తీసుకుంది. చిత్తూరు, వెరకటేశ్వర, కడప, కొవూరు, జంపని, అనకాపల్లి సహకార కర్మాగారాల్లో పనిచేస్తున్న వారికి వీఆర్ఎస్ అమలు చేయడం వల్ల రూ.108 కోట్ల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఈ చెల్లింపులపై ఉత్తర్వులు వచ్చినప్పటికీ బిల్లులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో ఉద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది సెప్టెంబరులోనే ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇంకా నిధులు మాత్రం విడుదల కాకపోవడం గమనార్హం.

# చట్టరీత్యా వినియోగదారులకు రక్షణ

కాకినాడ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం 1986 నుండి ఒక చట్టం అమలులోకి వచ్చిందని జాతీయ వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు చదలవాడ హరిబాబు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డబ్బులు చెల్లించి పొందే సేవలు లేదా కొనుగోలు చేసిన వస్తువులు చికాకు పెడితే వినియోగదారుల హక్కుల కింద ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. సేవల్లో లేదా కొనుగోలు చేసిన వస్తువులలో నాణ్యత లోపించినా, నష్టం కలిగినా పరిహారం పొందవచ్చు అని అన్నారు. బాధితులు న్యాయవాదిని ప్రత్యేకంగా పెట్టుకోవలసిన అవసరం లేదన్నారు. నేరుగా కేసు వేసి వాదించుకోవచ్చు అని అన్నారు. ఈనాడు పాలు, నూనె ఇలా అన్నీ కూడా కల్తీ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . వినియోగదారులు హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 425 0082 నెంబర్ల ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని హరిబాబు తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో హరిబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ భమిడిపాటి శివరామకృష్ణమూర్తి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యులు హెచ్ఎస్ రామకృష్ణ కొమ్మూరి శ్రీనివాస్, పవన్ చైతన్య, బి. నాగేశ్వరరావు, బాలకృష్ణ, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# 13 సంవత్సరాలు భార్యను గదిలో నిర్బంధించిన న్యాయవాది

విజయనగరం ఆ న్యాయవాది ఆ న్యాయవాద వృత్తికే కళంకం తెచ్చాడు. తన తల్లి, సోదరుడు మాటలు విని ఏకంగా 13 సంవత్సరాల పాటు తాళి కట్టిన భార్యను ఇంట్లో బంధించి బయట ప్రపంచానికి దూరం చేశాడు. చీకటి గదిలో బక్క చిక్కిన శరీరంతో 13 ఏళ్ల పాటు కఠినాతి కఠినమైన జీవితాన్ని ఆమె అనుభవించింది. బయట ప్రపంచానికి ఆమెను దూరం చేసాడు. గోదావరి మధుసూదన్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన సాయి సుప్రియ ను విజయనగరంలోని కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న గోదావరి మధుసూదన్ 2008లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం కలిగిన అనంతరం న్యాయవాది మధుసూదన్ తన తల్లి గోదావరి ఉమామహేశ్వరి తో పాటు తన తమ్ముడు మాటలు విని కట్టుకున్న భార్యను వేధించాడు. బయట ప్రపంచానికి దూరం చేస్తూ చీకటి గదిలో 13 సంవత్సరాలు పాటు బంధించాడు. బాధితురాలు కుటుంబ సభ్యులు ఎన్ని మార్లు అడిగినప్పటికీ బాధితురాలి కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. సహనం కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులు ఇటీవల జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయడంతో ఒకటవ పట్టణ పోలీసులు గతనెల 28 మధుసూదన్ ఇంటికి వెళ్లి పరిశీలించారు. తమ ఇంటిని తనిఖీ చేసే అధికారం మీకు లేదని, తనిఖీ చేసేందుకు కోర్టు ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అంటూ మధుసూదన్ పోలీసులను ప్రశ్నించి అడ్డుకున్నాడు. దాంతో బాధితురాలి తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ వారెంట్ తీసుకువచ్చారు. దీంతో బుధవారం పోలీసులు న్యాయవాది మధుసూదన్ ఇంటిని తనిఖీ చేయగా సాయి ప్రియ బక్క చిక్కిన శరీరంతో చీకటి గదిలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఓ మూలన కనిపించింది. దీంతో పోలీసులు ఆమెను బయటకు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు


# పందుల పోటీలు? నాలుగు పందుల స్వాధీనం

ఏలూరు ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం లోని పాలచర్ల, రాజవరం గ్రామ శివారు లలో భారీ ఎత్తున భారీ ఎత్తున పందు ల పోటీలు నిర్వహించారు. పందెల శిబిరం పై జీలుగుమిల్లి పోలీసులు దాడులు చేశారు. ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 4 పందులను 1670 రూపాయల నగదును స్వాధీనం చేసు కున్నారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు.

# డేటా సెంటర్ కేటాయింపులపై పునరాలోచన

విశాఖపట్టణం, మార్చి 2, గౌతమ్ అదానీ కంపెనీలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్టు నేపథ్యంలో విశాఖలో అదానీకి జరిపిన భూకేటాయింపులపై ప్రభుత్వం పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. విశాఖలో మార్చి మూడు, నాలుగు తేదీల్లో గ్లోబల్ ఇన్విస్టెమెంట్ సమ్మిట్ జరుగనున్న దృష్ట్యా అదానీ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇది వరకే ఖరారు చేశారు. అయితే అంతర్జాతీయంగా అదానీ డొల్ల కంపెనీలపై విమర్శలు రావడంతో శంకుస్థాపనను ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం విశేషం. విశాఖ భూ ప్రాజెక్టుకూ జాతీయ బ్యాంకులో రుణం కోసం దరఖాస్తు చేసుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు ఎపిఐఐసి అధికారుల ద్వారా తాజాగా తెలిసింది. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం పోర్టులు, ఆయిల్ కంపెనీలతో అక్రమ ఒప్పందాలు, భూముల కేటాయింపులతో అనుచిత లబ్ధిని చేకూర్చిన వైనంపై జగన్ సర్కారు తాజాగా బోనులో నిలబడింది. ఇదివరకే విశాఖలోని మధురవాడ సర్వే నెంబరు 409లో 130 ఎకరాలను 'అదానీ గ్రూప్ డేటా ఎనలటిక్స్ సెంటర్ (డిఎసి)' కోసం చేసిన అక్రమ భూ కేటాయింపుల విషయం తాజాగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మధురవాడ, కాపులుప్పాడ వంటి చోట్ల గజం స్థలం రూ.లక్షకు పైగా పలుకుతున్న నేపథ్యంలో రూ.4 వేల కోట్లకు పైగా ఉన్న స్థలాన్ని కేవలం రూ.130 కోట్లుకే కారుచౌకగా అదానీ డేటా సెంటర్ కోసం జగన్ ప్రభుత్వం ఇచ్చేసింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం 2012 సెప్టెంబర్ 14 నాటి జిఒ ఎంఎస్ 571 ద్వారా నోటిఫై చేసిన భూ వినియోగ విధానం ప్రకారం చూస్తే ప్రజాప్రయోజనాల కోసం ప్రైవేట్ ఏజెన్సీలు, సంస్థలకు లీజుకు ఇచ్చిన భూమికి సంవత్సరానికి లీజు, అద్దె దాని మార్కెట్ విలువలో 10 శాతం కంటే తక్కువగా ఉండకూడదు. దీని ప్రకారం చూసుకున్నా సరే ఏటా రూ.400 కోట్లును డేటా సెంటర్ నుంచి రాబట్టాల్సి ఉంది. కానీ ప్రభుత్వం రూ.130 కోట్లకు 130 ఎకరాలనూ కేటాయించడం ఏ చట్టం ప్రకారం చేసింది ? సహజ వనరులను ప్రైవేట్ వ్యక్తులకు ఎలా కట్టబెట్టింది ? అన్న ప్రశ్నలకు ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ఈ నెల 3న అదానీ డేటా సెంటర్‌కు మధురవాడలో 130 ఎకరాల్లో శంకుస్థాపన చేయడానికి ఇదివరకే సన్నాహాలు మొదలయ్యాయని, ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అదానీ వ్యవహారంపై అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చ నేపథ్యంలో ఆ కార్యక్రమం విశాఖలో రద్దయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ ఇటీవల అమల్లోకి రాగా రెండు నెలల క్రితమే గ్లోబల్ సమ్మిట్ విశాఖలో నిర్వహిస్తున్న నిర్ణయం జరిగి పనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. అదానీ ప్రాజెక్టు మాత్రమే అటకెక్కడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందన్నది స్పష్టంగా తెలుస్తోంది.

# ఉపాధ్యాయుల సంక్షేమానికి సహకారం అందిస్తా.



## -ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డి.

నెల్లూరు. ఉపాధ్యాయులకు నా వల్ల మంచి జరిగేలా ఉపాధ్యాయుల సంక్షేమానికి సేవాలందిస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఇస్కాన్ సిటీ లోని ఓవెల్ హై స్కూల్లో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ వేణు గారు హాజరై.. చంద్రశేఖర్ రెడ్డికి సాదరస్వాగతం పలికారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు అండగా చంద్రశేఖర్ రెడ్డి అనేక సేవలందించారని పాఠశాల యం డి వేణు తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి ఎమ్మెల్సీగా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ విద్యా రంగాలు రెండింటిని అభివృద్ధి చేస్తారన్న సంపూర్ణ విశ్వాసం తనకు ఉందన్నారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నవయస్సు నుంచి కష్టపడే మనస్తత్వం తనదని.. ఏపనైన అనుకుంటే పట్టుదలతో సాధనకు కృషి చేస్తానని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కృష్ణ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ గా ,రెడ్ క్రాస్ చైర్మన్ గా విద్యా, ఉపాధ్యాయ రంగాలకు తాను అనేక సేవలు చేశానని చెప్పారు. ఎమ్మెల్సీగా తాను గెలిచినప్పటికంటే.. ఉపాధ్యాయులకు ఎంతో కొంత, మేలు జరిగితేనే ఎక్కువగా సంతోషిస్తానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యారంగం ,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసని.. భవిష్యత్ లో వాటి పరిష్కారదిశగా కృషి చేస్తానని చెప్పారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమానికి హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరుకు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యం డి వేణు ,ఇతర ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి కి అభినందనలు తెలియజేశారు.

# పాలకులలు , రైతులకు ఇచ్చిన హామీలకు మాట నిలుపుకున్న నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు ఆ గ్రామ రైతులు.



ఆత్మకూరు..,. ( మార్చి 02 గురువారం ). నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నాగులపాడు గ్రామ రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. దేశానికి రైతే వెన్నుముక రైతే రాజు రైతు లేనిదే ఈ దేశం లేదు అన్న మాటలు చాలా వినుసంపుగా ఉంటాయి రైతులైన మేము విన్నప్పుడల్లా రాజులుగా ఒకింత ఆనందం కలిగించిన వాస్తు పరిస్థితులు చూస్తే రైతులకు గడ్డి తప్పితే ఏది మిగలని చందంగా రైతులు బ్రతుకులు మారాయని వాపోతున్నారు. రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయని కార్యచరణకు నోచుకోలేదన్నారు, ప్రభుత్వాలు మారినప్పుడల్లా, పాలకులు రాడం మాట ఇచ్చి తప్పినారు, మా పై తరం పడ్డ బాధలు నేటికీ మేము అనుభవిస్తున్నాము. మా గ్రామంలో ఏటి కాలువ పై భాగాన 500 ఎకరాలలో వరి, మామిడి సాగు చేస్తున్నారు. మా పొలాలకు వెళ్లాలంటే ఆత్మకూరు చెరువు కాలువను దాటి వెళ్లాల్సిందే, నిత్యం కలువ పారుదల సాగుతుంది . కాలువదాటి పండిన పంటను తీసుకొని రావదానికి ట్రాక్టర్ తప్పనిసరి , రవాణ ఖర్చులు భారీగా అవుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిచ్చ కోసం కాలువ దాటాలంటే గగనమే అవుతుంది.. ఏది ఏమైనా నాగులపాడు గ్రామ రైతులకు రాజీకియ నాయకులు హామీలు హామీలు గా మిగిలాయే తప్ప ఒరిగింది ఏమి లేదని వాపోయారు నాగులపాడు రైతులు...

# చదువుకు అంగవైకల్యం అడ్డు కాదని నిరూపించిన కత్తి వెంకటమ్మ

## కత్తి వెంకటమ్మకు డాక్టరేట్

శ్రీశైలం మార్చి 02 శ్రీశైలం మండలం శ్రీశైలం దేవస్థాన పరిధిలోని కొత్తపేటలో నిరక్షరాస్యులు అయినటువంటి కత్తి రాజయ్య దిబ్బులమ్మకు మూడవ సంతానం ప్రథమ కుమార్తెగా జన్మించిన కత్తి వెంకటమ్మ చిన్న జన్యూ లోపంతో జన్మించింది. ఐదు మంది కుమారులు ఇద్దరు కుమార్తెల సంతానంలో అందరికంటే ఉన్నత విద్యను అభ్యసించింది. అంగవైకల్యం ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డు కాదని నిరూపించింది కత్తి వెంకటమ్మ శ్రీశైలంలో జడ్.పి.హెచ్ స్కూల్లో ఒకటి నుండి 10వ తరగతి వరకు తన ప్రాథమిక విద్యను పూర్తి చేసి సున్నిపెంటలోని జూనియర్ కాలేజీలో హెచ్ఈసి డిగ్రీ కాలేజీలో బిఎ పూర్తి చేసింది. తర్వాత నంద్యాలలో బీఈడీ కూడా పూర్తిచేసి 2013-15వ సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైల ప్రాంగణంలో ఎంఏ చరిత్ర పురావస్తు శాస్త్రం పూర్తిచేసింది అలాగే 2016వ సంవత్సరంలో ఇదే విశ్వవిద్యాలయం నందు పీహెచ్ డి చేరి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అందించే ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఫెలోషిప్ కు ఎంపిక అయి విశ్రాంతి ఆచార్యులు రామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారి పర్యవేక్షణలో కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు అను సిద్ధాంత గ్రంథాన్ని కత్తి వెంకటమ్మ సమర్పించింది

# పవన్ తో కలిసి 175 స్థానాలకు పోటీ


కర్నూలు, మార్చి 2, (న్యూస్ పల్స్) టీడీపీ 175 స్థానాలలో పోటీ చేస్తామని చెప్పడం లేదు.. కానీ, బీజేపీ, జనసేన పార్టీతో కలిసి 175 స్థానాలలో పోటీ చేస్తుందని ప్రకటించారు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి.. కర్నూలులో మీడియాతో మాట్లాడిన ఆయన.. రానున్న రోజుల్లో సంచలనాత్మక నిర్ణయాలు బీజేపీ తీసుకోబోతుందని పేర్కొన్నారు.. రాయలసీమకు సంబంధించిన చంద్రబాబు, వైఎస్ జగన్.. రాయలసీమను మోసం చేశారని విమర్శించారు.. మేం అధికారంలోకి వస్తే రాయలసీమ డిక్లరేషన్ ఖచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.. అయితే, ఏపీలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని ఆరోపించారు.. టీడీపీ తమ నాయకులను పోటీలో పెట్టడానికి వెనాకాడుతుందన్న ఆయన.. టీడీపీ.. వైసీపీని ఎదురుకొనే స్థాయి లో లేదు.. వైసీపీకి పోటీగా నిలిచే పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. ఇక, వైసీపీ పట్టభద్రులను ప్రలోభాలకు గురిచేస్తుందని ఆరోపించారు విష్ణువర్ధన్‌రెడ్డి.. వైసీపీ నాయకులు అభివృద్ధిపై మాట్లాడడంలేదు.. చివరకు వార్తలు రాసిన జర్నలిస్టులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు.. హైకోర్టు చెప్పినా జర్నలిస్టులపై కేసులు నమోదు చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. సీఐపై ఇప్పటివరకు ఎందుకు విచారణ చేయలేదని నిలదీశారు.. ఏపీ హోమ్ మంత్రి ఈ ఘటన పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.. అధికారులు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తే ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు వస్తాయని వైసీపీ నేతలు ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు.. ఎన్నికల కమిషన్ ఎందుకు ఈ ఘటన సుమోటో గా తీసుకోరు అని ప్రశ్నించారు.. ప్రజలు కట్టే పన్నులను జీతాలుగా తీసుకొని వైసీపీకి తొత్తులుగా పనిచేస్తున్నారు అంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి.

# టీడీపీ, జనసేనకు అంత లేదు

నెల్లూరు, మార్చి 2, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సవాళ్ల పర్వం కొనసాగుతోంది.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము, ధైర్యం ఉందా అంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు సీఎం వైఎస్ జగన్ బహిరంగ సవాల్ విసిరితే.. ఆ సవాళ్ల పర్వం కొనసాగుతూనే ఉంది.. తాజాగా, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్.. నారా లోకేష్, పవన్ కల్యాణ్ కి సవాల్ విసిరారు.. 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పే ధైర్యం ఉందా.. అంటూ లోకేష్, పవన్‌ను చాలెంజ్ చేశారు.. ఈ విషయాన్ని పాదయాత్రలో లోకేష్ ప్రకటించచగలరా..? అని నిలదీశారు.. ఇక, పవన్ కళ్యాణ్ కనీసం మ్యాజిక్ ఫిగర్ స్థానాల్లో అయినా పోటీ చేస్తారా..? అని ఎద్దేవా చేశారు.. సింగిల్ గా పోటీ చేసే సత్తా లేని వీళ్లా? జగన్ గురించి మాట్లాడేది..? అంటూ మండిపడ్డారు అనిల్ కుమార్..ఇక, మాకు పొత్తులు అవసరం లేదు.. అప్పుడు, ఇప్పుడు.. మేం సింగిల్ గానే పోటీ చేస్తాం అని ప్రకటించారు అనిల్ కుమార్ యాదవ్.. కానీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలకు ఆ సత్తా ఉందా? అని ప్రశ్నించారు. మరోవైపు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ప్రశంసలు గుప్పించారు.. ఉద్యోగాల్లో మా హయాంలో వచ్చిన అవకాశాలు గతం కంటే ఎక్కువ అని ప్రకటించిన ఆయన.. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు మొత్తం మా వైపే ఉన్నారు.. వైసీపీ అభ్యర్థులు ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.. ప్రజాప్రతినిధులను ధైర్యంగా ప్రజల్లోకి పంపే ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అనిల్ కుమార్ యాదవ్.

# పెట్టుబడుల సదస్సుపై గంటా ప్రశ్నలు

విశాఖపట్టణం, మార్చి 2,విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్న ఏపీ ప్రభుత్వానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఓ లేఖ సంధించారు. గంటా శ్రీనిసరావు చేసిన ఓ ట్వీట్ వైరల్‌గ మారుతోంది. ఈ అంశంపై ఆయన తెలుగులో వైసీపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తూ కొన్ని అంశాలను ప్రస్తావించారు. ఇరవై అంశాలపై సూటిగా ప్రశ్నించారు. అందులో రాజధాని లేకపోవడం దగ్గర్నుంచి జాకీ పరిశ్రమను తరిమి వేయడం వరక అనేక కీలక సందేహాలు ఉన్నాయి. వాటన్నింటికీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దావోస్ పెట్టుబడుల సదస్సుకు ఏపీ ప్రభుత్వం వెళ్లకపోవడానికి కారణం ఏమిటో చెప్పాలని గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. దావోస్‌కు వెళ్లకపోవడం వల్ల జరిగిన నష్టం ఏమిటో ఇప్పటికైనా గుర్తించారా అని లేఖలో ప్రశ్నించారు. కియా అనుబంధ పరిశ్రమలు ఒక్క దానిని కూడా ఎందుకు ఏర్పాటు చేయించలేకపోయారు, లూలూ పరిశ్రమను వెళ్లగొట్టిన అంశం పెట్టుబడిదారుల సదస్సులో చెబుతారా ? బోగాపురం ఎయిర్ పోర్టును నాలుగేళ్ల పాటు పట్టించుకోకుండా.. ఇప్పుడు శంకుస్థాపన పేరుతో హడావుడి చేయడం ఎందు?కు ?, లా అండ్ ఆర్డర్ లేదని చెప్పి పెట్టుబడులు ఆకర్షిస్తారా?, జీతాలు ఇవ్వలేని రాష్ట్రంలో ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి వస్తారా ? అదానీ డేటా సెంటర్‌కు గతంలోనే శంకుస్థాపన చేసినా ఇంత వరకూ పనులు మొదలు పెట్టలేదని ఇంకా ఎందుకు భూములు కేటాయించారో చెప్పాలని గంటా డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో విశాఖలో 50వేల



మంది ఐటీ ఉద్యోగులు ఉండేవారు .. ఇప్పుడు రెండు మూడు వేల మంది కూడా లేరు..ఐటీ కంపెనీ?లను ఎందుకు తరివేశారు ? హెచ్ఎస్‌బీసీ వెళ్లిపోకుండా ఎందుకు ఆపలేకపోయారు ? సరైన ఉపాధి అవకాశాలు లేని రాష్ట్రంలో సగటు పౌరుడి కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయిందన్న విషయాన్ని గుర్తించారా ? నాలుగేళ్ల వరకూ పట్టించుకోకుండా.. ఎన్నికలకు ఏడాది ముందు పెట్టుబడుల సదస్సు పేరుతో హడావుడి చేయడానికి కారణం ఏమిటో చెప్పాలని గంటా శ్రీనివాసరావు డమాండ్ చేశారు. ఇవన్నీ రాజకీయ దురుద్దేశంతో రాస్తున్న ప్రశ్నలు కాదని ఏపీలో సగటు పౌరుడుకి ఉన్న సందేహాలని గంటా స్పష్టం చేశారు. గంటా శ్రీనివాసరావు లేఖపై పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పందించారు. దావోస్ వెళ్లి తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్ని పెట్టుబడులు తెచ్చారని ప్రశ్నించారు. అసలు ఏపీకి రాజధాని లేకుండా చేసింది చంద్రబాబేనని ఆరోపించారు. చంద్రబాబు రాసిన లేఖపై గంటా శ్రీనివసరావు సంతకం పెట్టినట్లుగా ఉందన్నారు.

# హిట్లర్ల వ్యవహరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

## సిపిఐ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులు నిరసిస్తూ చేతికి సంకెళ్లతో బద్వేల్ పట్టణంలో వినూత్న నిరసన

బద్వేలు ,రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీ లబ్ధిదారులకు నిర్మాణ వ్యయాన్ని పెంచాలని ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిట్కో ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన చేసి మార్చి 2న విజయవాడలో మహాధర్నా చేపట్టాలని పిలుపునివ్వగా నిన్నటి రోజున సిపిఐ నాయకత్వంలో లబ్ధిదారులు విజయవాడకు చేరుకోవడానికి ప్రయత్నిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని ఆలోచన చేసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వివిధ జిల్లాలలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను అక్రమంగా అన్యాయం అరెస్టు చేయడం అప్రజా స్వామికమని వైసీపీ ప్రభుత్వ హిట్లర్ పాలన నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ ) బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు చేతికి సంకెళ్లు వేసుకొని వినూత్న నిరసన చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్ మాట్లాడుతూ.... జగనన్న మాట తప్పడు మడమ తిప్పడు అని చెప్పి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 1,80,000 మాత్రమే జగనన్న గృహాలకు సరిపోదని ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడం పాపమా! నేరమా ఒక్క సెంటు స్థలంలో ఇచ్చే ఇళ్లల్లో కూడా మిగిలించుకోవాలని చూసి చూడటం సరికాదరి ఇప్పటికే ఇచ్చినటువంటి గృహాలు కూడా అధికార పార్టీ అన్యాయాలకే ఎక్కువగా ఉన్నాయని వారు బినామీ పేర్లతో గృహాలు పొంది ఇతరులకు లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు నిజమైన లబ్దరుడు పేదవాడు కాబట్టి ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు సరిపోక అప్పులు చేసుకుని నిర్మించుకుంటున్నారని అందుకే రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయడం దీనిపై మహా ధర్నాకు పిలిపిస్తే వైసీపీ ప్రభుత్వానికి వణుకు పుట్టుకని అక్రమంగా అరెస్టులు చేయించడం సరికాదని పోలీసు నిర్బంధాలతో, కేసులు జైలతో ఉద్యమాలు ఆపలేరని ముఖ్యమంత్రి గారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అనేక ఉద్యమాలు చేసిన తీరు మర్చిపోయారా అని ఆయన ప్రశ్నించారు సిపిఐ నాయకులు ఏమైనా తీవ్రవాదులు, సంఘ శక్తులుగా ఉన్నామ! అని ఆయన ప్రశ్నించారు రాష్ట్రంలో ప్రజా ఉద్యమాల పట్ల ధమన రానున్న ఎన్నికలలో కాండను ప్రయోగిస్తే రానున్నఎన్నికలలో ఇదే లబ్ధిదారులు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతారని వారన్నారు తక్షణమే జగనన్న గృహాల లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు ప్రకటించాలని, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిట్కో ఇండ్లను స్వాధీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శిజకరయ్య,సహాయ కార్యదర్శి చంద్రమోహన్ రాజు,పట్టణ కార్యదర్శి పి. బాలు, సహాయ కార్యదర్శి జి నరసింహ, జిల్లా సమితి సభ్యులు పడిగ వెంకటరమణ,కార్యవర్గ సభ్యులుపెంచలయ్య, పీవీ రమణ, విజయమ్మ, బాబు, పట్టణ నాయకులు నాగ సుబ్బయ్య, కాకి మల్ల సుబ్బరాయుడు,సుబ్బారెడ్డి, మూరా లక్ష్మమ్మ,ఏసన్న,జానయ్య, అమ్ములమ్మ,చెన్నయ్య,రామయ్య తదితరులు పాల్గొన్నారు



# వైసీపీని నమ్మితే అధోగతి తప్పదు



నంద్యాల :–ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన వైసిపి అరాచక దౌర్జన్యపాలన సాగిస్తున్నదని.. ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని నమ్మితే అధోగతి తప్పదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. గురు వారం టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రమైన నంద్యాలలోని ఆర్ఎస్ రోడ్డు బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ, ఎల్ఐసి ప్రధాన కార్యాలయం లలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి

## ---టిడిపి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.
## ---..టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్

ఏవిఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు కృపాకర్,అజ్మీర్, నాయకులు చాంద్, శరత్ , మీరావలి రెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి ని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని, ప్రతి సంవత్సరం డీఎస్సీ తో పాటు, లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తామని పేర్కొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం, ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల జీతాలు అందడం లేదని, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలతో పాటు, జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగాల భర్తీ చేపడతామన్నారు. రాష్ట్రంలో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటినన్నిటినీ భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్ యువత, ఉద్యోగులు గమనించాలన్నారు.తెలుగుదేశం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏ వి ఆర్ ప్రసాద్ పిలుపునిచ్చారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు




ఎమ్మిగనూరు ,ఎమ్మిగనూరు పట్టణంలో జగనన్న నిర్మిస్తున్న ఇంటికి 1,80,000 నుంచి 5 లక్షలకు పెంచాలని సీపీఐ రాష్ట్ర సమితి తలపెట్టిన ఈనెల 2 తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేయడానికి నంద్యాలలో ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణను,సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, విధంగా జిల్లాలో సిపిఐ శ్రేణులను ముందస్తు గృహనిర్బంధాలు అక్రమ అరెస్టులతో వైసిపి ప్రభుత్వం ఉద్యమాన్ని ఆపలే ఉంటూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలలో భాగంగా ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జూలై 1 రాష్ట్రంలో 9024 జగనన్న కాలనీలో నాలుగేండ్లు కాలంలో 27 లక్షల నిర్మాణానికి లక్ష్యంగా పెట్టుకున్నారని 2019 ఆగస్టు 26 నాటికి 15,03,810 ఇండ్లను పూర్తి చేస్తామని గొప్పలు చెప్పి చేతులెత్తేయడం జరిగిందని

## జగనన్న నిర్మిస్తున్న ఇంటికి ఐదు లక్షలకు పెంచాలనీ ధర్నా: సిపిఐ

ఈ సందర్భంగా వారు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సెంటు స్థలంలో ఇల్లు మేమే కట్టిస్తామని చెప్పి తర్వాత, మీరే కట్టుకోండి ?1,80,000 ఇస్తామని మాట మార్చి మడమతిప్పడని, పెరిగిన ధరలకు 1,80,000 ఏమాత్రం ఇల్లు సరిపోదని, తక్షణమే ఐదు లక్షల రూపాయలకు వ్యయాన్ని పెంచాలని సిపిఐ ఆధ్వర్యంలో గత రెండు నెలల నుంచి అనేక రూపాలలో పోరాటాలు కొనసాగించడం జరిగిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హామీలు ఇచ్చే విస్మరించడం తప్ప పూర్తి చేయడం లేదని అందులో భాగంగానే టీడ్కో గృహాలు ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా కనీస మహా కాలనీలో తాగునీరు డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ టిట్కో గృహాలు స్థితిలా వ్యవస్థకు చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నియంత పాలన పరిపాలిస్తూ ఈ రాష్ట్రంలో ప్రతిపక్షాల ఉద్యమాలు అంచవేస్తూ అక్రమ అరెస్టులకు నిర్బంధాలకు తెర లేపడం జరిగిందని ఇలాంటి అక్రమ అరెస్టులకు అక్రమ నిర్బంధాలకు కమ్యూనిస్టు పార్టీలు భయపడే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా వారు జగన్మోహన్ రెడ్డికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, మండల కార్యదర్శి బి.టి చిన్నాన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సత్తెన్న, పార్టీ ప్రజా సంఘాల నాయకులు కెసి జబ్బర్,రాజీవ్,బజారి, కాజా,వీరేష్,మల్లికార్జున, రామాంజనేయులు, బాబా,యోహాన, మాలిక్,ఖాదర్, నరసింహ,వీరేంద్ర, విజయ్,జయరాం, తదితరులు పాల్గొన్నారు

# ఆయుష్మాన్ భారత్ (పిఎంజేవై) మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సర్వేలు త్వరగా పూర్తి చేయండి





నంద్యాల :–.ఆయుష్మాన్ భారత్ కార్డులు అర్హత గల ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా లబ్ధిదారుల ఈ కేవైసీ సర్వే పూర్తి చేయాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి వార్డు సచివాలయ హెల్త్ సెక్రటీలను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలతో పట్టణంలో అర్హత కలిగిన 57,734 లబ్ధిదారులకు గాను ఇప్పటివరకు 26,292 మందికి మాత్రమే పూర్తయిన్నారు, మిగిలిన వారికి కూడా ఈ వారం రోజుల్లో తప్పనిసరిగా పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు . ఈ హెల్త్ కార్డు ద్వారా ఒక్కొక్క లబ్ధిదారునికి 5 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని కావున ప్రజలకు అవగాహన కల్పించి ఇందులో ఉన్న క్షేత్రస్థాయి మరియు సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుని పూర్తి చేయవలసిందిగా వారికి సూచించారు . మరియు సమగ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా గర్భవతులు, 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు మరియు 6 నుండి 19 సంవత్సరాల పిల్లల యొక్క స్థితిగతులను సర్వే చేసి వారి యొక్క లోపాలను సరిచేసి సమగ్ర సుస్థిర అభివృద్ధి సాధించే విధంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయవలసిందిగా హెల్త్ సెక్రటరీలను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశం నందు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసు మరియు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి పాల్గొన్నారు .

# డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: జిల్లా కలెక్టర్

తిరుపతి,,మార్చి 02: ఈ నెల 13 న జరగనున్న ఎం.ఎల్.సి. ఎన్నికల పోలింగ్ కు సంబంధించి సూళ్ళురుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేసి ఈ నెల 12 న పి.ఓ. లకు, ఎ.పి.ఓ.లకు పోలింగ్ మెటీరియల్ అందించడం పోలింగ్ అనంతరం బ్యాలట్ బాక్సులను భద్రపరచడం వంటివి జాగ్రత్తగా చేపట్టాలని చిన్నపొరపాటుకు కూడా తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకటరమణా రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూళ్లూరుపేట డివిజన్ నందు జిల్లా కలెక్టర్ పర్యటించి పోలింగ్ సామాగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరచనున్న స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ నిర్దేశించిన సమయానికి పోలింగ్ సామాగ్రి తీసుకోవడానికి పి.ఓ. లు, ఎ.పి.ఓ. లు, ఓ.పి.ఓ. లు నిర్దేశించిన సమయానికి ఈ నెల 12 న రిసెప్షన్ సెంటర్ అయిన జూనియర్ కళాశాలకు చేరుకోవాల్సి ఉంటుందని ఆ విధంగా మరోమారు ఆర్.డి.ఓ సూచనలు ఇవ్వాలని ఎన్నికల విధులలో గైర్హాజరు కారాదని అన్నారు.


# వీరసింహా రెడ్డి క్లోజింగ్ కలెక్షన్స్.. లాభం ఎంతంటే?



నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ చిత్రం వీరసింహారెడ్డి. అఖండ తర్వాత భారీ అంచనాల మధ్య సంక్రాంతికి రిలీజ్ అయిన ఈ మూవీ నందమూరి అభిమానులకి మాస్ కథలని యాక్షన్ సీక్వెన్స్ ఇష్టపడే వారికి భాగా కనెక్ట్ అయ్యింది. సినిమాలో సిస్టర్ సెంటిమెంట్ కూడా భాగా వర్క్ అవుట్ కావడంతో సినిమాకి పాజిటివ్ టాక్ వచ్చింది. అయితే సంక్రాంతి వీకెండ్ పూర్తయ్యాక సినిమా కలెక్షన్స్ కొంత మేరకు తగ్గాయని చెప్పాలి.వాల్తేర్ వీరయ్య సినిమా కూడా పోటీలో ఉండటం ఆ సినిమాకి పాజిటివ్ టాక్ రావడంతో వీరసింహారెడ్డి కలెక్షన్స్ పరంగా కొంత నెమ్మదిగా మూవ్ అయ్యింది. ఇదిలా ఉంటే లాంగ్ రన్ లో ఈ మూవీ 75.41 కోట్లని కలెక్ట్ చేసింది.ఈ మూవీ సినిమా బ్రేక్ ఎవెన్ టార్గెట్ 68 కోట్లు కావడం విశేషం. అంటే బిజినెస్ టార్గెట్ కంటే 10 శాతం అధికంగా కలెక్షన్స్ ని రాబట్టింది. దీంతో లాంగ్ రన్ లో ఓవరాల్ లో ఈ మూవీ డీసెంట్ కలెక్షన్స్ తో హిట్ బొమ్మగా నిలబడింది.ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న వీరసింహారెడ్డి డిజిటల్ ప్రేక్షకులని కూడా ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా క్లోజింగ్ కలెక్షన్స్ ఏరియా వైజ్ గా చూసుకుంటే నైజాంలో 17.25 కోట్లు సీడెడ్ లో 16.48 కోట్లు రాబట్టింది.మొత్తం తెలుగు రాష్ట్రాలలో 64.78 కోట్ల కలెక్షన్స్ ని ఈ మూవీ కొల్లగొట్టింది. ఇక రెస్ట్ ఆఫ్ ఇండియాలో 4.84 కోట్లు ఓవర్సీస్ లో 5.79 కోట్ల కలెక్షన్స్ ని రాబట్టింది. దీంతో ఈ మూవీ ఓవరాల్ కలెక్షన్స్ 75.41 కోట్లని అందుకుంది.ఇదంతా థియేటర్స్ ద్వారా వీరసింహారెడ్డికి వచ్చిన ఆదాయం. ఇక డిజిటల్ శాటిలైట్ డబ్బింగ్ రైట్స్ ద్వారా కూడా మైత్రీ నిర్మాతలకి ఈ మూవీతో మరింత ఆదాయం వచ్చిందని తెలుస్తుంది. మొత్తానికి అఖండ తర్వాత ఆ రేంజ్ బ్లాక్ బస్టర్ కాకున్న వీరసింహారెడ్డితో మరో హిట్ ని బాలయ్య తన ఖాతాలో వేసుకున్నారని ఈ కలెక్షన్స్ ద్వారా చెప్పొచ్చు.

# త్రివిక్రమ్ చేతికి బ్రహ్మీ.. ఈసారి క్లిక్కయితే..

స్టార్ కమెడియన్ గా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న నటుడు బ్రహ్మానందం. సుదీర్ఘకాలం పాటు కమెడియన్ గా నెంబర్ వన్ స్థానంలో ఉన్న బ్రహ్మానందం గత రెండేళ్ళ నుంచి క్రమంగా సినిమాలు తగ్గించేశారు. అప్పుడప్పుడు కొన్ని సినిమాలలో నిడివి తక్కువ ఉన్న పాత్రలలో కనిపిస్తూ వస్తున్నారు. ఒకే రకమైన పాత్రలు చేసి బోర్ కొట్టిందో లేక బ్రహ్మానందంకి సరిపడా పాత్రలని దర్శకులు సృష్టించలేకపోతున్నారో కాని అతని సినిమాలు మాత్రం భాగా తగ్గిపోయాయి.ఒకప్పుడు బ్రహ్మానందం లేకుండా స్టార్ హీరోల చిత్రాలు ఉండేవి కావు. అలా అని బ్రహ్మీని రిప్లేస్ చేసే కమెడియన్ టాలీవుడ్ లో లేరని చెప్పాలి. వయస్సు రీత్యా కూడా అతను ఆపరేషన్ చేసుకోవడంతో కాస్తా విశ్రాంతి తీసుకున్నారు.ఇదిలా ఉంటే ఈ మధ్య కామెడీ పాత్రల వైపు కాకుండా కాస్తా సీరియస్ రోల్స్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. రంగమార్తాండ అనే సినిమాలో బ్రాహ్మీ పవర్ ఫుల్ రోల్ లోనే కనిపిస్తున్నారు. ఇక ఆ మధ్య స్వాతి నటించిన వెబ్ సిరీస్ లో కూడా బ్రాహ్మీ కాస్తా ఇంటరెస్టింగ్ రోల్ లో కనిపించి మెప్పించారు. ఇదిలా ఉంటే చాలా గ్యాప్ తర్వాత ప్రస్తుతం పవన్ కళ్యాణ్ వినోదాయ సీతమ్ రీమేక్ లో కాస్తా నిడివి ఉన్న పాత్రలో బ్రహ్మానందం కనిపించబోతున్నాడు. ఈ సినిమాకి మాటలు స్క్రీన్ ప్లే త్రివిక్రమ్ శ్రీనివాస్ సమకూర్చారు.ఈ నేపధ్యంలోనే బ్రహ్మానందం కోసం ఓ మంచి పాత్రని సృష్టించినట్లు తెలుస్తుంది. రెగ్యులర్ కమెడియన్ తరహాలో కాకుండా మంచి ఇంటరెస్టింగ్ రోల్ లో బ్రాహ్మీని త్రివిక్రమ్ ఈ మూవీలో రిప్రజెంట్ చేసినట్లు తెలుస్తుంది.త్రివిక్రమ్ అత్తారింటికి దారేది సినిమా వరకు బ్రహ్మానందం అతని ప్రతి సినిమాలో కచ్చితంగా ఉండేవారు. మంచి టైమింగ్ ఉన్న పాత్రలలో మెప్పించేవారు. అతని చివరి మూడు సినిమాలలో మాత్రం బ్రాహ్మికి ఛాన్స్ లేదు. అయితే మరల వినోదాయ సీతమ్ సినిమా కోసం ఓ మంచి పాత్రతో మరల బ్రాహ్మీకి గ్రాండ్ ఎంట్రీని త్రివిక్రమ్ ఏర్పాటు చేసినట్లు టాక్ వినిపిస్తుంది. ఇది క్లిక్ అయితే మళ్ళీ అతని స్పీడ్ ని ఎవరూ ఆపలేరనే మాట ఫిల్మ్ నగర్ సర్కిల్ లో వినిపిస్తుంది.



# దిల్ రాజు తమిళ స్పీచ్.. పడీ పడీ నవ్విన కేటీఆర్

కమెడియన్ గా తెలుగు ప్రేక్షకులకు వేణు సుపరిచితమే. అలాంటి వేణు దర్శకుడుగా మారి చేస్తున్న సినిమా బలగం. దిల్ రాజు కుటుంబం నుంచి కొత్త బ్యానర్ గా ఏర్పాటైన దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ లో నిర్మితమైన ఈ సినిమా మార్చి 3వ తేదీన థియేటర్లకు రానున్న నేపథ్యంలో 'సిరిసిల్ల'లో అభిమానుల సమక్షంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంటును నిర్వహించారు. హీరో సిద్దు జొన్నలగడ్డ మంత్రి కేటీఆర్ ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ వేదికపై దిల్ రాజు మాట్లాడుతూ వారిసు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఆయన మాట్లాడిన మాటలు ట్రోల్ అవ్వగా వాటిని మరోసారి ప్రస్తావించారు. ఈ సినిమాలో ఫైట్స్ ఇల్లే(తమిళంలో లేదు అని అర్థం) ఈ సినిమాలో డ్యాన్స్ ఇల్లే ఈ సినిమాలో అందా విజయ్ సార్ బాడీ లాంగ్వేజ్ ఇల్లే బట్ ఇందా బలగంలో సూపర్ ఎంటర్టైన్మెంట్ ఇరుక్కు సూపర్ ఎమోషన్స్ ఇరుక్కు సూపర్ తెలంగాణ నేటివిటీ ఇరుక్కు ఇది మన తెలంగాణ గుండె కాయ లాంటి సినిమా ఇది మట్టుకు చెప్పగలుగుతా అంటూ కామెంట్లు చేయగా దానికి కేటీఆర్ పడి పడి నవ్వడం కనిపించింది.ఆ తర్వాత మంత్రి కేటీఆర్ కి దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. సిరిసిల్లలో ఈ సినిమా షూటింగు జరగడానికి అంతా కూడా ఎంతో సహకరించారని ఈ సందర్భంగా దిల్ రాజు రివీల్ చేశారు.తెలంగాణ నేపథ్యంలో గతంలో వచ్చిన 'ఒసేయ్ రాములమ్మా' ఎర్ర సైన్యం అంటే రివల్యూషనరీ సినిమాలను తెలంగాణ ప్రేక్షకులు ఆదరించారని తర్వాత తాను చేసిన 'ఫిదా' వంటి సినిమా కూడా భారీ హిట్ అయింది అని అన్నారు. వాటి అలాగే ఈ సినిమాకి కూడా ఆ స్థాయి ఆదరణ లభిస్తుందని భావిస్తున్నాను అని దిల్ రాకు అన్నారు.బలగం సిరిసిల్లలోని ఒక కుటుంబం చుట్టూ తిరిగే కథ అని పేర్కొన్న దిల్ రాజు మా సంస్థ నుంచి పరిచయమవుతున్న పదో దర్శకుడు వేణు ఈ సినిమాను తాను చాలా అద్భుతంగా ఆవిష్కరించాడన్నారు. 'బొమ్మరిల్లు' శతమానం భవతి' మాదిరిగా మా సంస్థకి బలగం మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నానని ఆయన అన్నారు.



# లంకతో టెస్టు సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన



శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. స్వదేశంలో లంకతో తలపడనున్న జట్టులో 13 మంది సభ్యులకు చోటిచ్చింది.ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడిన జట్టునే కొనసాగించింది. కాగా ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఘోర పరాభవం పాలైన కివీస్.. రెండో మ్యాచ్‌లో ఒక్కపరుగు తేడాతో సంచలన విజయంనమోదు చేసిన విషయం తెలిసిందే.లంకకు ఆ అవకాశంఈ క్రమంలో మార్చి 9 నుంచి లంకతో పోరుకు సిద్ధమవుతోంది టిమ్ సౌథీ బృందం. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2021–23 సీజన్‌లో భాగంగా కివీస్– లంక మధ్య రెండు మ్యాచ్‌లు జరుగనున్నాయి. క్రైస్ట్‌చర్చ్, వెల్లింగ్‌టన్‌లలో జరుగనున్న ఈ సిరీస్ శ్రీలంకకు కీలకంగా మారింది.ఒకవేళ న్యూజిలాండ్‌ను గనుక లంక వైట్‌వాష్ చేయడం సహా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమిండియా– ఆస్ట్రేలియాను క్లీన్‌స్వీప్ చేస్తే డబ్ల్యూటీసీ ఫైనల్ చేరేందుకు కరుణరత్నె బృందానికి అవకాశాలు ఉంటాయి. అయితే, సొంతగడ్డపై కివీస్‌ను ఓడించడం లంకకు తేలికేం కాదు. ఇక ఈ సిరీస్‌కు ఇప్పటికే లంక జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే.

న్యూజిలాండ్ వర్సెస్ శ్రీలంక టెస్టు సిరీస్–2023
మార్చి 9– మార్చి 21 వరకురెండు టెస్టులు
వేదికలు: క్రైస్ట్‌చర్చ్, వెల్లింగ్‌టన్
లంకతో సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ఇదే
టిమ్ సౌథీ (కెప్టెన్), టామ్ బ్లండెల్ (వికెట్), మైఖేల్ బ్రేస్‌వెల్, డెవాన్ కాన్వే, మాట్ హెన్రీ, టామ్ లాథమ్, డారిల్ మిచెల్, బ్లెయిర్ టిక్నర్, నీల్ వాగ్నర్, స్కాట్ కుగ్గెలీజన్, హెన్రీ నికోల్స్, కేన్ విలియమ్సన్, విల్ యంగ్.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190